www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 9 ఏప్రిల్ 2023
5
అన్నమయ్య

మతసామరస్యాన్ని చాటిన కరాటే విద్యార్థులు

ఇఫ్తార్ విందులో పాల్గొన్న కరాటే విద్యార్థులు

మదనపల్లె అర్బన్: రంజాన్ పండగ సందర్భంగా యూత్ కరాటే క్లబ్ కార్యాలయంలో ముస్లిం స్నేహితుల కొరకు హిందూ స్నేహితులు ఘనంగా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందరరేగా కరాటే మాస్టర్ డాక్టర్ ఎ.ఆర్. సురేష్ మాట్లాడుతూ పవిత్ర రంజాన్ పండుగకు ముందుగా ఇఫ్తార్ విందు ఇవ్వడం ఆనవాయితీ అని సాయంకాలం నమాజ్ చేసి ఖర్జూర పండు తిని ఒక్కపొద్దు తీర్చుకుంటారని తెలిఎరు. కులమతాలకు అతీతంగా ఇఫ్తార్ విందును ముస్లిం స్నేహితుల కొరకు హిందూ స్నేహితులు ఇస్తున్న ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కరాటే మాస్టర్లను, కరాటే విద్యార్థులను పలువురు పట్టణ ప్రముఖులు, తల్లిదండ్రులు అభినందించారు. కార్యక్రమంలో యూత్ కరాటే క్లబ్ కార్యదర్శి ఎం.మణిసాయి, లియకిత్ బాష, ఎస్.కరీముల్లాబాష, టి.మహేశ్వర్, షేక్‌మిస్బా, జోషితరెడ్డి పాల్గొన్నారు.

నిరసనలపై ఉక్కుపాదం

జిల్లా పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ అచ్చెన్న హత్యపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని కోరుతూ చేపట్టిన శాంతియుత నిరసన ర్యాలీపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. వామపక్షాలు, అఖిలపక్షం, దళిత సంఘాలు శనివారం పట్టణంలోని ఎర్రముక్కపల్లిలోని ఓ లాడ్జి దగ్గర నుంచి కోటిరెడ్డి సర్కిల్ మీదుగా చేపట్టిన శాంతియుత ర్యాలీని హౌస్ అరెస్టులు, నిర్బంధాలు, అరెస్టులతో అడ్డుకుంది. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణను లాడ్జి దగ్గర పోలీసులు అరెస్టు చేయడం, మిగిలిన వామపక్ష, అఖిలపక్ష, దళిత సంఘాల నాయకులను ఎక్కడికక్కడ అరెస్టులు, నిర్బంధించడం వంటి ఘటనలతో శాంతియుత ర్యాలీలను అడ్డుకున్నారు.

- డిడి అచ్చెన్న హత్యపై సిట్టింగ్ జడ్జితో విచారణకు ర్యాలీ
- హౌస్ అరెస్టులు, నిర్బంధాల మధ్య అడ్డంకులు
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అరెస్టు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి/కడప అర్బన్

జిల్లాలో రాజ్యాంగ బద్ధమైన నిరసన హక్కు ఉల్లంఘనలకు గురవుతోంది. ప్రభుత్వం అంటే ద్వర్ రాజ్యాంగాన్ని అమలు చేయడం లేదని విమర్శల్ని నిజమని నిరూపణ చేస్తున్నారు. గత నెల 12న జిల్లా పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ అచ్చెన్న హత్యకు గురికావడం చర్చనీయాంశంగా మారింది. హత్యకు ముందు డిడి అచ్చెన్న ముగ్గురు సహోద్యోగులతో తనకు ప్రాణహాని ఉందని పోలీసులకు ఫిర్యాదు చేయడం, పోలీసులు ఫిర్యాదును నిర్లక్ష్యం వహించడం, అనంతర కాలంలో డిడి హత్యకు గురికావడం, ఆయన మృతదేహాన్ని కుటుంబ సభ్యుల అభిప్రాయం లేకుండానే పోస్టుమార్టం చేయడం వంటి వరుస ఘటనలపై సందేహాలు వ్యక్తం కావడం తెలిసిందే. జిల్లాలోని వామపక్షాలు, అఖిలపక్షాలు, దళిత సంఘాలు శాంతియుత నిరసన ర్యాలీకి పిలుపునిచ్చాయి. ఇందుకు అనుగుణంగా కార్యాచరణను సైతం ప్రకటించడం తెలిసిందే. శనివారం ఉదయం నగరంలో తలపెట్టిన శాంతియుత నిరసన ర్యాలీపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లా పశుసంవర్ధక శాఖలోని ముగ్గురు ఉద్యోగులపై వచ్చిన ఆరోపణలపై పారదర్శకంగా విచారణ చేపట్టాల్సిందిపోయి, రాజకీయంగా రాద్ధాంతం చేయడానికి ప్రభుత్వం ఆస్కారాన్ని కల్పించడం వెనుక అంతర్యమేమిటనే సందేహాలు తావిస్తోంది. రాజకీయంలేని సమస్యను రాద్ధాంతం చేయడానికి అవకాశం కల్పించడం స్వయంకృతాపరాధమే అనుకోవాలి. రాష్ట్రంలో మైనార్టీలు, దళితులపై దాడులు పెచ్చుమీరుతున్నాయనే వాదన సమంజసమే అనిపించే భావనకు ఆస్కారాన్ని కల్పించడం స్వీయవినాశనమేనని సంగతిని గుర్తెరగాల్సి ఉంది.

అరెస్టయిన వారిలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శితోపాటు టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి, సిపిఐ జిల్లా నగర కార్యదర్శులు చంద్ర, వెంకటశివ, ఎఐటియుసి నగర ప్రధాన కార్యదర్శి మద్దిలేటి, మైనుద్దీన్, సిపిఎం నగర కమిటీ సభ్యులు ఓబులేసు, టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సత్తార్, జాతీయ నాయకులు బండి జకరయ్య ఉన్నారు. శాంతియుత ర్యాలీ అడ్డుకోవడం దుర్మార్గమని వారు పేర్కొన్నారు.

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి

సిట్టింగ్ జడ్జితో విచారించాలి : రామకృష్ణ

డాక్టర్ అచ్చెన్న ఎంతో నిజాయితీ పరుడని, ఆయన హత్యపై వెంటనే సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామ కృష్ణ డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మార్చి 12న అచ్చెన్న కిడ్నాప్ అయిన వెంటనే ఆయన కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. రాష్ట్రంలో దళితులు, మైనార్టీలపైనా జరుగుతున్న అత్యాచారాలపైనా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపేందుకు బయలుదేరుతున్న అఖిలపక్ష నేతలను అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. దళితులు, మైనార్టీలపై జరుగుతున్న అన్యాయాల్ని ఖండించడం నేరమా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. సొంత జిల్లాలో దళితులపై దాడులు జరిగినా ఇంతవరకు సిఎం జగన్మోహన్ రెడ్డి స్పందించకపోవడం ఆయన చేతకానితనానికి నిదర్శనమని విమర్శించారు. అఖిలపక్ష నాయకులను, దళిత సంఘాల నేతలను, వామపక్ష నేతలను కార్యకర్తలను పోలీసులు నిర్బంధించి హౌస్ అరెస్టులు, ఎక్కడికక్కడ నిర్బంధం చేసి కడపను పోలీసు చేతుల్లోకి తీసుకున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా, నగర కార్యదర్శి జి. చంద్రశేఖర్, రామమోహన్, కమిటీ సభ్యులు చంద్రారెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు లక్ష్మిరెడ్డి, అఖిలపక్ష ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

అరెస్టు అప్రజాస్వామికం : సిపిఎం

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, అఖిలపక్ష పార్టీలు, సంఘాలతో కలిసి డాక్టర్ అచ్చెన హత్య ఉదాంతంపై మానస ఇన్‌లో విలేకరుల సమావేశం నిర్వహిస్తుండగా పోలీసులు అరెస్టు చేయడం అప్రజాస్వామికమని సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్ పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించే హక్కును హరించడమేనన్నారు. వైసిపి ప్రభుత్వం పోలీసులను అడ్డం పెట్టుకుని ప్రతిపక్షాల గొంతు నొక్కడానికి, బాధితులను భయబ్రాంతులకు గురి చేయటమేనని పేర్కొన్నారు. డాక్టర్ అచ్చెన్న హత్య ఉదాంతంపై జరుగుతున్న నిరసన, ఆందోళనలను హైకోర్టు సుమోటోగా స్వీకరించి సిట్టింగ్ జడ్జి విచారణకు ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పోలీసుల అదుపులో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ నాయకులు బండి జకరయ్య

ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం

విసికె పార్టీ జాతీయ అధ్యక్షులు డాక్టర్ తిరుమావళవన్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

నేడు భారతదేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడుకొని, రాజ్యాంగాన్ని రక్షించుకునే పరిస్థితి ఏర్పడిందని విసికె పార్టీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ తిరుమావళవన్ అన్నారు. శనివారం విడుదలై చిరుతైగల్ కట్చి (విసికె పార్టీ) ప్రథమ రాష్ట్ర మహాసభను పురస్కరించుకొని పట్టణంలోని బిటి కళాశాల గ్రౌండ్‌లో ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిటిఎం శివప్రసాద్ అధ్యక్షతన రాజ్యాంగ రక్షణ రణభేరి మహాసభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తిరుమావళవన్ మాట్లాడుతూ కార్మికుల వ్యవసాయ, దళితుల, గిరిజనుల, మహిళల హక్కుల కోసం ఎన్నో పోరాటాలు చేసామని, కానీ నేడు వాటన్నిటికీ మించి భారత రాజ్యాంగాన్ని రక్షించుకుందామని అనేటువంటి పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. దేశాన్ని పాలిస్తున్న వాళ్లు ఇంత ప్రమాదకరమైన వ్యక్తులు కావడం వలనే మనం రాజ్యాంగాన్ని రక్షించుకుందాం అనే నినాదన్ని ఇవ్వడం జరిగిందని తెలిపారు. మనం కాపాడుకుంటున్న ప్రజాస్వామ్యం వెలుగులను ధ్వంసం చేస్తున్నారని, అంబేద్కర్ శ్రమించి రచించిన రాజ్యాంగం 70 సంవత్సరాలుగా కాపాడుకుంటున్న ప్రజాస్వామ్య విలువలను ఈ ఎనిమిది సంవత్సరాలలోనే వాళ్లు పూర్తిగా ధ్వంసం చేసే స్థాయికి దిగజారి పోయారని తెలిపారు. దేశాన్ని పరిపాలిస్తున్న వారు ఎవరు మనం అర్థం చేసుకొని ఒక అవగాహనకు రావాలన్నారు. ఈ దేశాన్ని బిజెపి పరిపాలిస్తుందని అందరూ అనుకుంటున్నారు. విభజన హామీలను గాలికొదిలేసి, నిధుల కేటాయింపులో మొండిచేయి చూపి ఆంధ్రప్రదేశ్ ప్రజల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టిన బిజెపిని 2024 ఎన్నికల్లో పాతాలంలోకి తొక్కేయాల్సిన అవసరం ఉందని, ఆ వైపుగా ప్రజల్ని చైతన్యవంతం చేయడానికే రాజ్యాంగ రక్షణ రణభేరి మహాసభను నిర్వహించడం జరుగుతోందని చెప్పారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ భారతదేశాన్ని పాతాళానికి తొక్కి మూడు వేల సంవత్సరాలు వెనక్కి తీసుకెళ్లి మనువాద పరిపాలన మనపై రుద్దటానికి మోడీ సిద్ధపడ్డాడని అన్నారు. ఈ సమాజంలో కులాధిపత్యాన్ని బ్రాహ్మణ ఆధిపత్యాన్ని, అగ్రకుల ఆతిపత్యాన్ని తెచ్చి అణగారిన కులాలను అణగదొక్కి శ్రామిక లోకాలను తుంగలో తొక్కేసి దానిపై అంబానీ, అదానీ జెండా ఎగరేసి కార్పొరేట్ మతోన్మాదం సృష్టించడానికి మోడీ కంకణం కట్టుకున్నారని పేర్కొన్నారు. అలాంటి మోడీకి ఈ దేశాన్ని పరిపాలించే అర్హత లేదని తెలిపారు. ప్రజలందరికీ సమాన అవకాశాలను, సమాన గౌరవాన్ని, మానవ హక్కులను ప్రసాదించిన భారత రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను రద్దుచేసి మళ్ళీ మనుస్మృతిని భారత రాజ్యాంగంగా తీసుకొచ్చి చాతుర్వర్ణ సిద్ధాంతాన్ని అమలు చేయాలని బిజెపి కుటిల యత్నం చేస్తోందన్నారు. సిపిఐ రాష్ట్రకార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రంలో దళితుల లక్ష్యంగా దాడులు, దౌర్జన్యాల జరుగుతున్నాయని అన్నారు. రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యం బదులు, రాజారెడ్డి రాజ్యం అనుసరిస్తున్నారని విమర్శించారు. కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో జగన్ నియంతలా వివరిస్తూ పేదల లక్ష్యంగా దళితులపై దాడులు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ప్రత్యేక అతిథిలుగా ప్రజాయుద్ధ నౌక గద్దర్, కర్ణాటక మాజీ స్పీకర్, శ్రీనివాసపురం ఎమ్మెల్యే రమేష్ కుమార్, వికెసి పార్టీ తెలుగు రాష్ట్రాల ఇన్‌ఛార్జులు బాల సింగం, ఎపి రాష్ట్ర అధ్యక్షులు విద్యాసాగర్, వికెసి పార్టీ ఎమ్మెల్యేలు బాలాజీ, మహమ్మద్ షాన్వాజ్, వికెసి పార్టీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి ముత్యాల మోహన్ పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న విసికె పార్టీ జాతీయ అధ్యక్షులు డాక్టర్ తిరుమావళవన్

'ముదివేడు' నిర్వాసితులకు పరిహారం చెల్లించాలి

సమస్య పరిష్కారమయ్యే వరకూ పోరాడుదాం
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-కురబలకోట

ముదివేడు రిజర్వాయర్ నిర్వాసితులకు నష్టపరిహారం ఇవ్వకుండా, కాలయాపన చేయడమే కాకుండా కాంట్రాక్టర్లకు వంతపాడటం ప్రభుత్వ దుర్నీతికి నిదర్శనమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. శనివారం ముదివేడు రిజర్వాయర్‌ను సందర్శించి, ముంపు గ్రామాలైన శీతివారిపల్లి, కొత్తపల్లి, చౌటకుంటపల్లి ప్రజలను పరామర్శించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ 2013 భూ సేకరణ చట్టం ప్రకారం ప్రభుత్వ అవసరాలకు భూములను తీసుకున్నప్పుడు గ్రామసభలు జరిపి, నోటీసులు అందించి, అందరూ ఆమోదించిన అనంతరం అవార్డు ప్రకటించి, నష్టపరిహారం చెల్లించాలని పేర్కొన్నారు. తర్వాత నిర్మాణ పనులను ప్రారంభించాలన్నారు. నిబంధనలను ప్రభుత్వం తుంగలో తొక్కి ప్రజలను మోసం చేశాని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎకరాకు రూ.12 లక్షలు ఇస్తామని నోటిమాట ద్వారా చెప్పడం దుర్మార్గమన్నారు. ముదివేడు రిజర్వాయర్ నిర్వాసితులకు ఎకరాకు రూ.40 లక్షల పరిహారం, ఇంటికొక ఉద్యోగం, భూమిలేని కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్లకు రెవెన్యూ అధికారులు కొమ్ము కాస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు గ్రామాలు పూర్తిగా మునిగిపోయి కనుమరుగవుతుంటే అధికారులు, ప్రజాప్రతినిధులు భరోసా ఇవ్వకపోవడం అత్యంత హేయమన్నారు. రిజర్వాయర్ ముంపు బాధితులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని, భూమికి ప్రత్యామ్నాయ భూమి చూపించాలని, ఎకరాకు రూ.40 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. పార్లమెంటులో చేసిన చట్టాలు కాపాడాల్సిన స్థానిక పార్లమెంట్ సభ్యులు మిథున్‌రెడ్డి, స్థానిక శాసనసభ్యులు ద్వారకనాథ్‌రెడ్డిలు ఎందుకు ప్రశ్నించలేదని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి రైతులతో చర్చించి సమస్యలు పరిష్కారం చేసేంత వరకూ నిర్వాసితులతో కలసి పోరాడుతామని హెచ్చరించారు. అధికారులు పక్షపాత ధోరణి వదలి నిర్వాసితులు అందరికీ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రైతులు, వ్యవసాయ కూలీలు ఐక్యంగా ఉద్యమం నిర్వహించినప్పుడే సమస్యలు పరిష్కారం అవు తాయని, అందుకు ప్రజలు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు, నాయకులు అబ్బవరం రామాంజులు, ప్రభాకర్‌రెడ్డి, సిహెచ్.చంద్రశేఖర్, రవికుమార్, నిర్వాసితులు పాల్గొన్నారు.

రిజర్వాయర్ పనులను పరిశీలిస్తున్న శ్రీనివాసరావు

అన్నమయ్య జిల్లా ఎస్‌పి బదిలీ
- నూతన ఎస్‌పిగా గంగాధర్‌రావు

ప్రజాశక్తి-రాయచోటి

అన్నమయ్య జిల్లా ఎస్‌పి వి.హర్షవర్ధన్ రాజు బదిలీ అయ్యారు. శుక్రవారం అర్ధరాత్రి తర్వాత ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయనను సిఐడి ఎస్‌పిగా బదిలీ చేసింది. ఆయన స్థానంలో ఎసిబి ఎస్‌పిగా ఉన్న ఆర్.గంగాధర్ రావును అన్నమయ్య జిల్లా ఎస్‌పిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన త్వరలోనే బాధ్యతలు స్వీకరించనున్నారు.

అవాంఛనీయం
'ప్రజాదృష్టి'

జిల్లాలో వైసిపి నాయకులు శివాలెత్తిపోవడం పరిపాటిగా మారింది. బ్రహ్మంగారిమఠం తహశీల్దార్ అసైన్‌మెంట్ భూముల కేటాయింపుల్లో తన అనుచరులకు సమధిక వాటాను కేటాయించక పోవడమే తాజా దౌర్జన్యానికి కారణమని తెలుస్తోంది. గతేడాది అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి మున్సిపల్ కమిషనర్‌పై ఎమ్మెల్యే అనుచరులు కమిషనర్ కార్యాలయంలోకి చొరబడి గందరగోళం సృష్టించడం తెలిసిందే. బ్రహ్మంగారిమఠం మండల మెజిస్ట్రేట్ అసైన్‌మెంట్ భూముల కేటాయింపుల్లో తన అనుచరులకు అధిక వాటా లేదనే కారణంతో దాడి చేసిన తరహాలో బెదిరింపులకు పాల్పడడం శోచనీయం. ఎక్కడో పశ్చిమగోదావరి జిల్లా తహశీల్దార్ వనజాక్షిపై అక్కడి ఎమ్మెల్యే అనచరులు దాడి చేయడాన్ని అధికార వైసిపి ఉటంకించడం తెలిసిందే. మరి కడప, అన్నమయ్య జిల్లాలోని బ్రహ్మంగారిమఠం తహశీల్దార్‌పై బెదిరింపు, ముట్టడి తరహా ఘటనకు అధికార వైసిపి ఏమి సమాధానం చెబుతుందో చూడాలి. ఎవరు అధికారంలో ఉన్నా అధికారులపై దాడులకు పాల్పడడం దొందూదొందేననే నిరూపణ అవుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా పోలీసులు, రెవెన్యూ అధికారులపై తరుచుగా ఇటువంటి ఘటనలు చోటు చేసుకోవడం పరిపాటిగా మారింది. ఎస్‌ఐ, సిఐ స్థాయి అధికారులనైతే బదిలీలు చేయించడం, రెవెన్యూ అధికారులైతే వారిపై బెదిరింపులు, దాడికి పాల్పడినంత పనిచేసి బెదరగొట్టడం తరుచుగా జరుగుతోంది. ఇటువంటి దురాగతాలకు పుల్‌స్టాఫ్ పెట్టాల్సిన అవసరం ఉంది. అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు విధులు సక్రమంగా నిర్వర్తించే అధికారులపై చెలరేగిపోవడం ఆందోళనకరం. రాజకీయ పార్టీలు అధికారులతో ఎలా పనిచేయించుకోవాలో స్థానిక నాయకత్వానికి శిక్షణ ఇవ్వవలిసిన అవసరం ఉంది. లేనిపక్షంలో సమాజంలో నైతిక విలువలు కనుచూపు మేరలో కనిపించే అవకాశమే లేకుండా పోయే అవకాశాలు పుష్కలముగా ఉన్నాయనే వాదన వినిపిస్తోంది. ఫలితంగా వ్యవస్థలు అద్వానంగా మారిపోయే అవకాశం ఉంది. నైతిక విలువల విధ్వంసక ప్రభావం రాజకీయ పార్టీలన్నింటిపైనాపడే అవకాశం ఉంది. అధికారం ఎవరికి శాశ్వతం కాదన్న సంగతిని గుర్తెరగాలి. రాజకీయ పార్టీల సంగతి ఎలా ఉన్నా, జిల్లాలోని గెజిటెడ్, నాన్‌గెజిటెడ్, ఎన్‌జిఒ అసోసియేషన్స్ ఏమి చేస్తున్నాయో తెలియడం లేదనే విమర్శ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. గతేడాది రాయచోటి మున్సిపల్ కమిషనర్, తాజాగా బ్రహ్మంగారిమఠం తహశీల్దార్ వంతైతే, రేపు మీ వంతు అనే సంగతిని అసోసియేషన్ నాయకులు గుర్తించకపోవడం విస్మయాన్ని కలిగిస్తోంది. జిల్లా ఉన్నతాధికారులు కిందిస్థాయి అధికారులపై జరుగుతున్న బెదిరింపులు, ముట్టడి, దాడుల తరహా ఘటనలపై నోరు విప్ప కపోవడం లేదు. అధికార పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులు వ్యవస్థలపై పట్టు కలిగి ఉండడం వల్లే ఇటువంటి బెదిరింపుల తరహా ఘటనలు చోటుచేసుకుంటున్నాయనే వాదన వినిపిస్తోంది. రాజకీయ పార్టీలు, పౌరసమాజం, మేధావులు, అధికారులు, ప్రజలు సకాలంలో స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పవచ్చు.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కోనేరులో శ్రీరాముడికి చక్రస్నానం చేయిస్తున్న అర్చకులు

ధ్వజావరోహణంతో ముగిసిన
కోదండరాముడి బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి - ఒంటిమిట్ట

ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి వారి ఆలయంలో తొమ్మిది రోజుల పాటు నిర్వహించిన వార్షిక బ్రహోత్సవాలు శనివారం రాత్రి ధ్వజావరోహణంతో ఘనంగా ముగిశాయి. రాత్రి 7 గంటల నుండి అర్చకులు శాస్త్రోక్తంగా ధ్వజావరోహణ ఘట్టం నిర్వహించారు. గరుడ పటాన్ని అవనతం చేసి ధ్వజారోహణం నాడు ఆహ్వానించిన సకల దేవతలను సాగనంపారు. చివరిరోజైన ఉదయం ఆలయ సమీపంలోని పుష్కరిణిలో చక్రస్నానం నేత్రపర్వంగా జరిగింది. విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని పుణ్యస్నానాలు ఆచరించారు. ఆలయంలో ఉదయం 4 గంటలకు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి ఆలయ శుద్ధి, ఆరాధన నిర్వహించారు. ఉదయం 9.30 గంటలకు శ్రీ లక్ష్మణ సమేత సీతారాములవారు తిరుచ్చిలో, సుదర్శన చక్రత్తాళ్వార్ పల్లకిలో ఊరేగింపుగా పుష్కరిణి వద్దకు వేంచేశారు. ఉదయం 10.30 నుండి 11 గంటల వరకు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు వేడుకగా స్నపనతిరుమంజనం నిర్వహించారు. సీతారామ లక్ష్మణ సరసన చక్రత్తాళ్వార్లు పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనంతో అభిషేకాలు అందుకున్నారు. అనంతరం అర్చకులు వేదమంత్రోచ్ఛారణ నడుమ శాస్త్రోక్తంగా చక్రస్నానం నిర్వహించారు. రాత్రి 7 గంటలకు ధ్వజావరోహణంతో శ్రీకోదండరామస్వామివారి బ్రహోత్సవాలు ముగిశాయి. కార్యక్రమంలో డెప్యూటీ ఇఒ నటేష్ బాబు, సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనుంజయ, ఆలయ అర్చకులు పాల్గొన్నారు. శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో 10వ రోజు ఆదివారం సాయంత్రం 6 నుండి రాత్రి 9.00 గంటల వరకు పుష్పయాగం వైభవంగా నిర్వహించనున్నారు.

కస్తూర్బా బాలికల పాఠశాలలో వంట గ్యాస్ లీక్

ప్రజాశక్తి-వీరబల్లి

మాట్లాడుతున్న డిఇఒ పురుషోత్తం, సిఐ లింగప్ప

కస్తూర్బా బాలికల పాఠశాలలో శనివారం ఉదయం 10 గంటల సమయంలో వంట చేస్తుండగా గ్యాస్ లీక్ కావడంతో మంటలు అంటుకున్నాయి. అక్కడ పనిచేస్తున్న వంట సిబ్బంది భయంతో బయటకు పరుగులు తీశారు. అదే సమయంలో 10వ తరగతి పరీక్షా కేంద్రాన్ని పరిశీలించేందుకు వెళ్లిన రాయచోటి ఉప విద్యాశాధికారి వరలక్ష్మి, వీరబల్లి ఎంఇఒ గిరి వరదయ్య అక్కడికి వెళ్లారు. కస్తూర్బా విద్యార్థుల కోసం వంట తయారు చేస్తున్న సమయంలో గ్యాస్ సిలిండర్ స్టౌకు మధ్య ఉన్న పైపు పగలడంతో గ్యాస్ లీకై మంటలు ఎగిసి పడ్డాయి. అక్కడే పోలీసు విధులు నిర్వహిస్తున్న సిబ్బంది కరెంటు సరఫరా తొలగించి, మంటలు ఆర్పే ప్రయత్నించారు. మంటలు అదుపులోనికి రాలేదు. సమీపంలో ఉన్న సిలిండర్లను ఎంఇఒ గిరివరదయ్య బయటకు తెచ్చారు. సిఐ లింగప్పకు విషయం తెలియడంతో ఆయన అప్రమత్తమై వెంటనే పైఅంతస్తులో 10వ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులందరినీ బయటకు తీసుకొచ్చి వంట గదిలోకి వెళ్లి గ్యాస్‌కు ఉన్న రెగ్యులేటర్‌ను ఆర్పివేడంతో మంటలు అదుపులోకి వచ్చాయి. సమాచారం అందుకున్న అన్నమయ్య జిల్లా విద్యాశాఖ అధికారి పురుషోత్తం వెంటనే వీరబల్లి కస్తూర్బా బాలికల విద్యాలయం పరీక్షా కేంద్రాన్ని, గ్యాస్ లీకైన సంఘటన స్థలాన్ని పరిశీలించి, ఇలాంటి సంఘటనలు పునరావృతం కారాదని పాఠశాల ప్రత్యేక అధికారి కుసుమను హెచ్చరించారు. విద్యార్థులు ఎలాంటి ఆందోళనలకు గురికాకుండా పరీక్షలు రాయాలని సూచించారు. కార్యక్రమంలో వీరబల్లి ఎస్ఐ రహీముల్లా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

శిశువు భవితకు వ్యాధి నిరోధక టీకాలు

ప్రజాశక్తి-పీలేరు

శిశువు భవితకు భరోసాగా వ్యాధి నిరోధక టీకాలు ఉపకరిస్తాయని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారిణి డాక్టర్ ఉషశ్రీ తెలిపారు. శనివారం డాక్టర్ ఉషశ్రీ తలపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో వ్యాధి నిరోధక టీకాలు నిర్వహించే మొరవవడ్డిపల్లి, పీలేరు బివి రెడ్డి కాలనీలోని కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లడుతూ ప్రతి ఎఎన్ఎం సూక్ష్మ ప్రణాళిక ప్రకారం శిశువుకి, నిర్దేశించిన సమయానికి, సమయపాలన పాటిస్తూ, సరియగు మోతాదులో జాప్యానికి తావులేకుండా శిశువుకు వ్యాధినిరోదక టీకాలు ఇవ్వాలని అన్నారు. పిల్లలు వ్యాధులతో అనారోగ్యానికి లోనుకాకుండా, అంగవైకల్యానికి గురికాకుండా వ్యాధి నిరోధకశక్తి వృద్ధి చెందుతుందని చెప్పారు. ఏ టీకా ఏఏ వ్యాధిని నిరోధిస్తుందో తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తే కార్యక్రమం విజయవంతం అవుతుందని చెప్పారు. వ్యాధి నిరోదకటీకాల ప్రాముఖ్యత గురించి తల్లులకు, ఆరోగ్య సిబ్బందికి వివరించారు. కోవిడ్ నిబంధనలు, వాక్సిన్ యొక్క వివిఎం రికార్డ్స్, రిపోర్ట్స్ పరిశీలించి సంత ృప్తిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ చంద్రశేఖర్ నాయక్, సిహెచ్ఓ నారాయణ, పర్యవేక్షకులు కుసుమ, సిహెచ్ఓ అయేష, ఎఎన్ఎం విజయకుమారి, రేణుక, అంగన్వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కూరగాయలు లారీ వద్ద దాతలు

శ్రీవారి నిత్యాన్నదానానికి 4 టన్నుల కూరగాయలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

శ్రీవారి నిత్యాన్నదానానికి శనివారం మదనపల్లి వారపుసంత కెజె మండి నిర్వాహకులు దాదాపీర్, ఖాజాపీర్ సంయుక్త ఆధ్వర్యంలో నాలుగు టన్నుల కూరగాయలు పంపారు. ప్రతి నెలా అనవాయితీగా శ్రీవారి భక్తుల ఆకలి తీర్చడం కోసం టన్నుల కొద్ది కూరగాయలు పంపుతూ ఆదర్శంగా నిలచారు. పేదలు నివాసం వుండే ప్రాంతాల్లో ఉచితంగా కూరగాయలు పంపిణీ చేస్తూ వారివురు మానవత్వాన్ని చాటుతున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి తిరుమల తిరుపతి దేవస్థానం నిత్య అన్నదానానికి కెజె కాయగూరల మండి నిర్వహకులు దాదాపీర్, ఖాజాపీర్ ఏడు పర్యాయాలు కాయగూరలు, ఆకుకూరలు వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా దాదాపీర్ మాట్లాడుతూ కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వర స్వామి దర్శనం కోసం ప్రతిరోజు తిరుమలకు దేశంలోని నలుమూలల నుండి వేలాది మంది భక్తులకు నిత్య అన్నదానం కార్యక్రమంలో తాము భాగస్వాములు కావడం సంతోషంగా ఉందన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో రైతు ఆకుల గోపాలకృష్ణతో కలసి కూరగాయలు పంపామన్నారు. కార్యక్రమంలో ఇమ్రోజ్ పీర్, గోపాలకృష్ణ, మస్తాన్, అయూబ్, రెడ్డిరామ్, ప్రసాద్, మస్తాన్, సర్దార్, గురు, లాల్, రాకా, మున్నా, అమీద్, దేవేందర్, చోటు, రాజు, లక్ష్మణ్, చందన్, మస్తాన్, మంజునాథ్ కుమార్, రాకేష్, చందన్, మున్నా, రేవంత్, గంగిరెడ్డి, గణేష్ సత్తార్, గురు, లాల్, రాఖా, మున్నా, అమిత్, దర్మేదర్, చోటు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

చంద్రబాబు సిఎం కావాలని దర్గాలో ప్రార్థనలు

ప్రజాశక్తి-రాయచోటి

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పరిపాలన అంతం కావాలని రాష్ట్ర భవిష్యత్తు నారా చంద్రబాబు నాయుడుతో సాధ్యమని నెల్లూరు పట్టణంలోని బారాషహీద్ దర్గాలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్బాషా ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ రాష్ట్రంలో జగన్ అరాచక పాలనకు ప్రజలు చరమగీతం పాడేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజాసేవే పరమావధిగా పనిచేస్తున్న మాజీ ఎమ్మెల్యే రమేష్‌రెడ్డితో రాయచోటి అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో చిన్నమండెం మండల అధ్యక్షులు బెల్లం నర్సింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి నాగభూషణం, యూనిట్ ఇన్‌ఛార్జి దేవగోపాల్ నాయుడు, రాజంపేట పార్లమెంటరీ తెలుగు యువత కార్యదర్శి మైనుద్దీన్, యూనిట్ ఇన్‌ఛార్జి మహ మ్మద్ అలీ, తెలుగు యువత నాయకులు యూనుస్, జావీద్, హుస్సేన్, రాజంపేట పార్లమెంటరీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి బాకీ, బాకీ వుల్ల ఖాన్ పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న డిఎంహెచ్ఒ డాక్టర్ కొండయ్య

గర్భిణులకు పోషకాహారం తప్పనిసరి : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి-నందలూరు

మండల పరిధిలో పిల్లల టీకాలు, గర్భిణులకు పోషకాహారం, ఐరన్ మాత్రల పంపిణీపై డిఎంహెచ్ఒ డాక్టర్ కొండయ్య శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి డాక్టర్ సృజన మండల పరిధిలోని లేబాక హరిజనవాడ, చెన్నయ్యగారిపల్లి, నల్లతిమ్మాయపల్లి గ్రామాలలో టీకాల కార్యక్రమం, గర్భిణులకు మాత్రల పంపిణీ, పోషకహారం పంపిణీ ఇతర కార్యక్రమాల అమలు పై డిఎంహెచ్ఒకు వివరించారు. ఆడపూరు హరిజనవాడలో ఫ్యామిలీ ఫిజిషియన్ ప్రోగ్రామ్, అంగన్వాడీ కేంద్రం, కంటి వెలుగు కార్యక్రమం తనిఖీ చేసి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, సిహెచ్ఒ నారాయణ, కంటి పరీక్ష నిపుణులు చంద్రశేఖర్, సిద్దరామయ్య, లక్ష్మయ్య, సుబ్బయ్య, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు, 104 సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రామిరెడ్డి ధ్వజారెడ్డి

బస్సు షెల్టర్ నిర్మాణంపై అసత్య ఆరోపణలు తగవు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

పట్టణంలోని టోల్‌గేట్ సెంటర్ వద్ద ప్రయాణికుల వసతి కోసం నిర్మించిన బస్ షెల్టర్ నిర్మాణం ఎపిఎండిసి నిధులతో చేపట్టినట్లు జనసేన నాయకులు అసత్య ఆరోపణలు చేయడం తగదని వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్ షెల్టర్ నిర్మాణం పూర్తిగా తన సొంత నిధులతోనే చేపట్టడం జరిగిందని ఎపిఎండిసి నిధులకు సంబంధం లేదని అన్నారు. ఎపిఎండిసి నిధులతో బస్‌షెల్టర్ నిర్మాణం చేపట్టినట్లు జనసేన నాయకులు నిరూపించగలరా అని సవాల్ విసిరారు. నిరూపించినట్లయితే తన పదవికి రాజీనామా చేస్తానని, అలా నిరూపించకపోతే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహామండలి జిల్లా చైర్మన్ సుకుమార్‌రెడ్డి, వైసిపి రాష్ట్ర ప్రచార కార్యదర్శి సిడి నాగేంద్ర యాదవ్, అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ రమేష్, పట్టణ కన్వీనర్ రమేష్, నాగేంద్ర, సర్పంచులు హరికృష్ణారెడ్డి, సుబ్రహ్మణ్యం రాజు, రామకృష్ణ, శ్రీరామ్ వినోద్, రమణారెడ్డి పాల్గొన్నారు.

కనులపండువగా శ్రీసీతారాముల కల్యాణం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

స్థానిక కొలిమి వీధిలోని కోదండ రామాలయంలో శనివారం అర్చకులు శ్రీ సీతారాముల కళ్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఈ కల్యాణాన్ని తిలకించేందుకు రాజంపేట పరిసర ప్రాంత ప్రజలు, భక్తులు అశేషంగా పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. **పుల్లంపేట:** మండలంలోని ఆర్.గొల్లపల్లి గ్రామంలో గండికోట విజయశేఖర్‌రెడ్డి, సంధ్య దంపతులు ఆధ్వర్యంలో సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని వేద పండితులు శివశర్మ, ఆత్రేయ శర్మ ఆధ్వర్యంలో రమణీయంగా నిర్వహించారు. కళ్యాణం అనంతరం భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎరికల్ రెడ్డి, పోలీ చంగల్ రెడ్డి, నరేష్ రెడ్డి, రామ సుబ్బారెడ్డి, చిన్న రెడ్డయ్య రెడ్డి, సురేంద్ర రెడ్డి, శివయ్య, పోలి మధు రెడ్డి, పిచ్చిరెడ్డి, పోలి సుధాకర్ రెడ్డి, వంశీధర్ రెడ్డి, గ్రీష్మంత్ రెడ్డి, కుటుంబ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రేమాలయం వృద్ధాశ్రమంలో అన్నదానం

రామాపురం: లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో రాయచోటికి చెందిన సి.లక్ష్మి పతి 15 వ వర్ధంతి సందర్భంగా భార్య సి.కృష్ణ కుమారి ఆర్థిక సాయంతో శనివారం స్థానిక బండపల్లె ప్రేమాలయం వృద్ధాశ్రయంలో అన్నదానం చేశామని అధ్యక్షులు లయన్ షేక్ మహమ్మద్ తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడే ఎన్నో సేవా కార్యక్రమాలు లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ద్వారా నిర్వహిస్తున్నామని అన్నారు. పేద ప్రజలకు సహాయం చేసే అవకాశం కలగడం భగవంతుడు మానవులకు ఇచ్చిన గొప్ప వరమని తెలిపారు. ప్రతి ఒక్కరూ డబ్బులు వృధా చేయకుండా ప్రజలకు ఉపయోగపడే సేవ కార్యక్రమాలు చేయాలని కోరారు. దాత సి.కృష్ణ కుమారి మాట్లాడుతూ తన భర్త లక్ష్మిపతి వర్ధంతి సందర్భంగా ఆశ్రమంలో అన్నదానం చేశామని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు లయన్ వి హరీష్ చంద్ర, కుమారుడు సి.రవితేజ, కోడలు మీన, కూతురు లక్ష్మిప్రత్యూష, అల్లుడు శ్రీహరి, యాక్షిత్, జ్యోతి, యశ్వంత్, శ్రీకాంత్, శ్రీహన్ ఆశ్రమమ్ మేనేజర్ సుబ్బయ్య, వృద్ధాశ్రమం పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** నిరాశ్రయులను ఆదుకునేందుకు తమ వంతు సహాయంగా శనివారం పట్టణ కేంద్రంలోని కొత్త బస్టాండ్, రైల్వే స్టేషన్, పాత బస్టాండ్ తదితర ప్రాంతాలలో ఉన్నటువంటి అభాగ్యులకు బచ్చోటి ప్రణయ్ దీప్, బచ్చోటి ప్రణీత లు అల్పాహారం ప్యాకెట్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంచితనానికి మారుపేరుగా నిలిచి, తమ హృదయాలలో చెరగని ముద్ర వేసుకున్న వారి పెద్దనాన్న బచ్చోటి రామకృష్ణ భౌతికంగా తమ నుంచి దూరమైనప్పటికీ ఆయన జ్ఞాపకాలను స్మరించుకుంటూ రెండవ వర్ధంతి సందర్భంగా నిరుపేద అభాగ్యులకు అల్పాహారం ప్యాకెట్లను పంపిణీ చేశామన్నారు. ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథంతో నిరుపేద అభాగ్యులను ఆదుకునేందుకు సహాయ సహకారం అందించాలని కోరారు.

గోశాలకు పశుగ్రాసం వితరణ

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలోని కన్నెమడుగు పంచాయతీలో కనికలమ్మ గోశాలలోని పశువులకు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి ఫీడ్, పశుగ్రాసం వితరనగా ఇచ్చారు. శనివారం సర్పంచ్ శ్యామలమ్మ, ఎంపిటిసి సభ్యులు మహేష్, నాయకులు రామ్ శంకర్‌రెడ్డి, మద్దిరెడ్డిలు గోశాలకు వెళ్లి 20 బస్తాల ఫీడ్ (దాన), అయిదు ట్రాక్టర్ల పశుగ్రాసం గోశాల మేనేజర్ రామ్మూర్తికి అందించారు. ఎమ్మెల్యే దాతృత్వాన్ని గోశాల నిర్వహకులు అభినందించారు.

కెఎస్ఎన్ఆర్ ట్రోఫీ-2కె23 ప్రారంభం

ప్రజాశక్తి - కడప అర్బన్

కందుల గ్రూప్ విద్యా సంస్థల అధి. పతి, మాజీ శాసన మం డలి, శాసన సభ్యులు, ప్ర ముఖ పారి శ్రామికవేత్త, కీ.శే. కందుల శివానంద రెడ్డి 74వ జయంతి పుర స్కరించుకుని, కళా శాల స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వ ర్యంలో శనివారం కెఎస్ ఎన్ఆర్ ట్రోఫీ 2కె23ని నిర్వహిం చారు. విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి (నాని) లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తితో ఆడాలని, గెలుపు, ఓటమిని సమానంగా స్వీకరి ంచాలని పేర్కొ న్నారు. వారం రోజులపాటు నిర్వహించే ఈ క్రీడాంశల్లో రాయల సీమ నలు మూలల నుంచి వివిధ ఇంజినీరింగ్ కళాశాల క్రీడాకారులు వేరు వేరు క్రీడలలో కనపడతారని చెప్పారు. ఈనెల 15 న తన తండ్రి 74 వ జయం తి సందర్భంగా ప్రథమ, ద్వితీయ స్థానాలను గెలుచుకున్న విజేతలకు బహు మతులు ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సి పల్ డాక్టర్ వి ఎస్ ఎస్ మూర్తి, కె.ఎల్.ఎమ్ మహిళా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం వి రత్నమ్మ, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ పి ప్రేమ్ కుమార్, వివిధ శాఖల అధి పతులు, కళాశాల స్పోర్ట్స్ క్లబ్ సమన్వయకర్త వంశీ నాయక్, నారా యణ, కెఎల్ఎం మహిళ కళాశాల ఫిజికల్ డైరక్టర్ గంగా దేవి, సిబ్బంది, విద్యా ర్థులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి కృషి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-వీరబల్లి

ప్రజలు ఏ ఇంటికి వెళ్లిన జగనన్నే మా భవిష్యత్తు అంటున్నారని ఎమ్మెల్యే మేడా మల్లికార్జున్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని సంఘం వాండ్లపల్లి పంచాయతీ సర్పంచ్ దయ్యాల కృష్ణయ్య, ఎంపిపి రాజేంద్రనాథ్‌రెడ్డి, ప్రజా ప్రతినిధులు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లతో కలిసి ఉత్సాహంగా "జగనన్న నువ్వే మా భవిష్యత్తు" మా నమ్మకం నువ్వే జగన్ అనే కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ పాలన పై ప్రజల్లో అపారమైన విశ్వాసం వ్యక్తమైందన్నారు. గతంలో ఎప్పుడు లేని విధంగా సంక్షేమ ఫలాలు అర్హుల చెంతకే చేరాయని సంతృప్తి వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం కంటే భిన్నంగా వైసిపి పాలనలో ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు వస్తున్నాయని మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపిపి రాజేంద్రనాథ్‌రెడ్డి, జడ్‌పిటిసి శివరాంగౌడ్, సర్పంచ్ దయ్యాల కృష్ణయ్య, సింగిల్ విండో చైర్మన్ అమర్నాథ్‌రెడ్డి, ఎంపిటిసి ఆంజనేయులు, సర్పంచ్ గోపీనాథ్ రెడ్డి, బ్రహ్మయ్య, వెంకటస్వామి, లోకేష్, చిన్న కృష్ణ, రమేష్, రామ్మోహన్, విశ్వనాథరెడ్డి, పోలీస్ సిబ్బం, మండల నాయకులు పాల్గొన్నారు. **నిమ్మనపల్లి :** 'జగనన్నే మా భవిష్యత్తు –మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని రాచవేటివారిపల్లి పంచాయతీ ఎగువమాచిరెడ్డిగారి పల్లెలో వైసిపి ఇన్‌చార్జి ఆర్‌ఐ.రమణారెడ్డి, ఆర్‌బికె. చైర్మన్ ప్రవీణ్ కుమార్‌రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ రామమోహన్ రెడ్డి, సర్పంచు సుబ్రమణ్యం, రాజంపేట పార్లమెంటు ప్రధాన కార్యదర్శి కొమ్మేపల్లి శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిటిసి రెడ్డివెంకటేష్, సర్పంచులు సుబ్రమణ్యం, చంద్రాయుడు, సచివాలయ కన్వీనర్లు పి.షావల్లి, శోభ, రవీంద్రనాథ్‌రెడ్డి, నాయకులు నరేంద్రరెడ్డి, చంద్రారెడ్డి, దొర, శ్రీనివాసులురెడ్డి, నవీన్, రెడ్డిభాస్కర, హేమంత్, యుగంధర్ రెడ్డి, నాగరాజా, శంకర, గంగాధర, రామారావు, చక్రపాణి రెడ్డి పాల్గొన్నారు. **నందలూరు :** వాలంటీర్లు, సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి అర్హులైన ప్రతి పేదవానికి కుల మతాలకు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత మన ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డిదేనని ఎంపిపి మేడా విజయభాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆడపూరు పంచాయతీలో నువ్వే మా నమ్మకం జగనన్న జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ చైతన్య భారతి, జడ్‌పిటిసి గడికోట ఉషా సుబ్బారెడ్డి, వక్ఫ్‌బోర్డ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ అమీర్, మండల కో–ఆప్షన్ సభ్యులు కలీం, రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ డైరెక్టర్ లక్ష్మీ నరసయ్య, ఎంపిటిసి తుమ్మల భావన శ్రీధర్‌గౌడ్ , వైసిపి నాయకులు నందలూరు భాస్కర్‌రెడ్డి, నడివీధి సుధాకర్, సుబ్బారెడ్డి, మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

మా నమ్మకం నువ్వే జగనన్న స్టిక్కర్లను అందిస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి

ఓబులవారిపల్లి : జగనన్నే మా భవిష్యత్తు..మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని బాలిరెడ్డిపల్లి గ్రామంలో ప్రభుత్వ విప్ శాసనసభ్యులు కొరముట్ల శ్రీనివాసులు, ఎపి టూరిజం డైరెక్టర్ సాయి కిషోర్‌రెడ్డి, బిసి నాయకులు ఈశ్వరయ్య, బాబురెడ్డి, రామచంద్రారెడ్డి, విజయారెడ్డి, చత్రరెడ్డి, జయవర్ధన, మహేష్‌లు పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి నవ రత్నాలు గురించి వివరించడం జరుగుతోందని జిల్లా వర్ఫ్ బోర్డు చైర్మన్ ఎస్ఎ.కరీముల్లా అన్నారు. పట్టణంలోని 14 వ వార్డులో కౌన్సిలర్ షేక్ షబానాతో పాటు వార్డు కన్వీనర్లు, గృహ సారథులు, సచివాలయం కార్యదర్శులతో కలసి ఇంటింటికి వెళ్ళి, కుటుంబ సభ్యులను పలకరిస్తూ జగన్ మోహన్ రెడ్డి పాలనలో అందుతున్న పథకాలను వివరిస్తు స్టికర్లు అంటించారు. **కలకడ:** మండలంలోని బాటవారిపల్లె నీలప్పగారిపల్లి గ్రామాలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంపిపి శ్రీదేవి రవికుమార్‌లు పాల్గొన్నారు. ప్రజా సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రజలలో మమేకమై ప్రజల అభ్యున్నతికి పాటుపడుతున్నారని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు రవికుమార్, రెడ్డప్ప, శ్రీనాథ్ సచివాలయం కన్వీనర్ నాగరాజ, ఉదయ్ భాస్కర్, సునీత వాలంటీర్స్ పాల్గొన్నారు. **పుల్లంపేట :** మండల పరిధిలోని అప్పయ్య రాజుపేట గ్రామంలో నాడు సయ్యద్ ముస్తాక్, మండల సచివాలయాల కన్వీనర్ నాగిరెడ్డి హరినాథ్ రెడ్డి ఆధ్వర్యంలో జగనన్న మా నమ్మకం నువ్వే – జగనన్నే మా భవిష్యత్ ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నినాదంతో ముద్రించిన స్టిక్కర్లను యజమాని అనుమతితోనే అతికిస్తామని తెలిపారు. 2024 సంవత్సరంలో జగనన్న భారీ మెజారిటీతో గెలిచి ప్రభుత్వం ఏర్పాటు చేయబోతున్నారని చెప్పారు. క్రార్యక్రమంలో సయ్యద్ రిజ్వాన్ పాల్గొన్నారు.

ఎపిఎండిసికి నిధుల కేటాయింపులో వివక్ష

మాట్లాడుతున్న పంతగాని నరసింహ ప్రసాద్

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

రైల్వేకోడూరు నియోజకవర్గంలోని ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఎపిఎండిసి మైనింగ్ ద్వారా వేల కోట్ల రూపాయల ఆదాయ వనరులుగా ఉండగా దళిత నియోజకవర్గ అభివృద్ధికి నిధుల కేటాయింపులో ఎండి వివక్షత చూపుతున్నారని టిడిపి సాంస్కృతిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు పంతగాని నరసింహ ప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థలు ఆ ప్రాంత అభివృద్ధి పనులకు గాను సిఎస్ఆర్ ద్వారా నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టాలని, కానీ ప్రస్తుత ఎండి బాధ్యతలు చేపట్టిన అనంతరం పక్క నియోజకవర్గాలైన చిత్తూరు, కడప జిల్లాకు దాదాపు సిఎస్ఆర్ నిధుల ద్వారా మినరల్ వాటర్ ప్లాంట్లను, కమ్యూనిటీ హాల్ నిర్మాణాలకు నిధులు కేటాయించాలని కోడూరు నియోజకవర్గంలో కమ్యూనిటీ హాల్ అవసరం ఉందని స్థానిక ప్రజా ప్రతినిధులు కోర లేదా ఎండి గారు అని ప్రశ్నించారు. సిఎస్ఆర్ నిధుల ద్వారా వాటర్ ప్లాంట్స్ హాస్పిటల్స్ పక్క నియోజకవర్గాలకు నిధులు కేటాయించడం ఎంతవరకు సబబు అని ఆయన అన్నారు. మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరిపాలనలో ఎపిఎండిసి నిధుల ద్వారా గ్రామీణ ప్రాంతాలకు రోడ్లు వాటర్ ప్లాంట్లు, స్కూళ్లు, ఆస్పత్రులు ఏర్పాటు చేసిన ఘనత టిడిపికే చెందుతుందని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత నాయకులు బొక్కసం సునీల్, పార్టీ బిసి రాష్ట్ర కార్యదర్శి మండ్ల అమర్, కూని చంద్రయ్య, కస్తూరి దినేష్, చిగురుపాటి శంకరయ్య పాల్గొన్నారు.

పోలీసుల కనుసన్నల్లోనే చెయ్యేరు లూటీ..!

ప్రజాశక్తి- నందలూరు

పోలీసుల కనుసన్నుల్లో కొందరు ఇసుకాసురులు చెయ్యేరు ను లూటీ చేస్తున్నారు. మండల కేంద్రమైన నందలూరులో కొందరు పోలీసుల సాక్షిగా యధేచ్ఛగా ఇసుక దోపిడీ సాగుతుంది. ప్రస్తుతం నందలూరు ఎస్ఐగా పనిచేస్తున్న మైనుద్దీన్ బదిలీపై వెళ్లడంతో కొందరు ట్రాక్టర్ యజమానులు పోలీసులతో కుమ్మక్కై ఇసుక దోపిడీకి పాల్పడుతున్నట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. చీకటి పడితే చాలు అన్న విధంగా కొందరు ట్రాక్టర్ యజమానులు ఇసుక అక్రమ రవాణాలో పోలీసులను భాగస్వామ్యం చేస్తూ గత కొన్ని రోజులుగా విచ్చలవిడిగా చెయ్యేరులోని ఇసుకను తోడేస్తూ నారాయణ రాజు పేట పాత రోడ్డు నుండి మంటపం పల్లి మీదుగా ఇసుకను చేరవేస్తున్నారు. సమీప ప్రాంతాలకు చెందిన ప్రజలు రాత్రివేళల్లో నిద్ర లేక ట్రాక్టర్ల శబ్దాలతో అల్లాడి పోతున్నామని వాపోతున్నారు. రాత్రి 11 గంటల నుంచి తెల్లవారుజామున 6 గంటల వరకు అక్రమ రవాణా యధేచ్ఛగా సాగుతున్నట్టు తెలిసింది. గొల్లపల్లి, ఆడపూరు, ఇసుకపల్లి, నందలూరు, టంగుటూరు, లేబాక ప్రాంతాల్లోని చెయ్యేరు పరివాహక ప్రాంతం నుంచి ఇసుకను యధేచ్ఛగా తరలిస్తున్నారు. మండలంలో ఇసుక క్వారీ లేకపోవడంతో కొందరు ట్రాక్టర్ల యజమానులు నందలూరు సమీపంలో అందుబాటులో ఉన్న ప్రాంతం నుంచి ఇసుక దోపిడీ చేస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాతో భూగర్భ జలాలు అడుగంటిపోయే ప్రమాదంతో పాటు ప్రభుత్వ ఆదాయానికి గండి పడే అవకాశముంది. స్థానికంగా ఇసుక క్వారీ లేకపోవడంతో గృహాలు నిర్మించు కుంటున్న వారికి ఇసుక దొరకక ఇబ్బందులు పడుతున్నారు. ఇంటి నిర్మాణ యజమానులు అధిక ధరకు కూడా ఇసుకను కొనేందుకు ముందుకు వస్తున్నారు. దీనిని ఆసరాగా తీసుకున్న కొందరు ట్రాక్టర్ యజమానులు పోలీసుల సహకారంతో అక్రమంగా ఇసుకను రవాణా చేస్తూ తమ జేబులు నింపుకుంటున్నారు. పోలీస్ స్టేషన్‌కు ఎస్ఐ లేకపోవడం మూలంగానే ఈ ఇసుక దోపిడీ వ్యవహారం సాగుతున్నట్లు సమాచారం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని స్థానికులు కోరుకుంటున్నారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం

ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసిపి అధికారం చేపట్టినప్పటి నుంచి సంక్షేమం,అభివృద్ధి దిశలో పయనిస్తుందని అన్నారు. రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి సాకారంతో దేశంలోని వంద ప్రముఖ దిగ్గజ కంపెనీలతో రాజంపేటలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని చెప్పారు. రాజంపేట, కోడూరు నియోజకవర్గాలకు చెందిన నిరుద్యోగ యువతకు ఉపాధి కోసం ఏర్పాటు చేశామని, పదవ తరగతి నుంచి పీజీ వరకు చదివిన నిరుద్యోగ యువతి యువకులకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశ్యంతో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి రామిరెడ్డి ప్రజారెడ్డి, వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ సుకుమార్ రెడ్డి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి సి.డి.నాగేంద్ర యాదవ్, మండల కన్వీనర్ సుధాకర్ రాజు, టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ సాయి కిషోర్ రెడ్డి, టి రాజేంద్ర, సర్పంచులు రామకృష్ణ, సుబ్రహ్మణ్యం రాజు, హరికృష్ణ రెడ్డి, ఈశ్వరయ్య, రమణారెడ్డి, రవూఫ్, సిహెచ్ రమేష్, నాగేంద్ర పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు

అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న జెఎసి నాయకులు

ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి : జెఎసి

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్రంలో పనిచేస్తున్న ఉద్యోగ, ఉపాధ్య, కార్మిక, రిటైర్డు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం చిత్తశుద్ధితో పోరాటం చేస్తున్న ఎపిజెఎసి అమరావతి నాయకత్వానికి ఉద్యోగులందరి మద్దతు ఉందని నాయకులు జీవన్ చంద్రశేఖర్, కృష్ణ కుమార్, రోనాల్డ్, పురుషోత్తం, రవిబాబు అన్నారు. శనివారం అంబేద్కర్ విగ్రహం ఎదుట నల్ల బ్యాడ్జీలు, కండువాలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యమం ఇంకా కొనసాగించడానికి, మలిదశ ఉద్యమ కార్యాచరణ ప్రకటించడానికి ప్రభుత్వం ఉద్యోగుల పట్ల వ్యవహరిస్తున్న నిర్లక్ష్యదోరణే కారణమని పేర్కొన్నారు. న్యాయ మైన డిమాండ్లు సాధించుకునేందుకు పోరాటం కొనసాగిస్తామని చెప్పారు. జీతం పెరిగితేనే సంతోష పడే వారం, నేడు జీతం పడితే సంతోషించే స్థాయికి రావడం బాధాకరమని వాపోయారు. రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు ఉద్యోగులకు సంబంధించిన ప్రధాన డిమాండ్ల పరిష్కారం కోసం పోరాటం కొనసాగించాలని తెలిపారు. అందులో భాగంగా డిమాండ్ పోస్టర్లను విడుదల చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో మునిసిపల్ కార్పొరేషన్ జనరల్ సెక్రటరీ రవి బాబు, నాయకులు గుర్రప్ప, శ్రీరాములు, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు సుబ్బారెడ్డి, మురళి, శ్రీనివాసులురెడ్డి, హుస్సేన్, ప్రసాద్, ఖాదర్‌బాషా, కార్మిక పరిషద్ నాయకులు నారాయణ, శేఖర్, బాలగంగిరెడ్డి, లచ్చన్న, ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

మామిడిలో ఫ్రూట్ కవర్లు తప్పకుండా పెట్టాలి

ప్రజాశక్తి - వేంపల్లె

మామిడిలో ఫ్రూట్ కవర్లు తప్పనిసరిగా రైతులు వాడాలని తిరుపతి నిమ్మ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులురెడ్డి సూచించారు. శనివారం ఉద్యానవనశాఖ అధికారి రెడ్డయ్యతో కలిసి వేంపల్లె, చక్రాయపేట, వీరపునాయునిపల్లె మండలాల్లోని చీనీ, నిమ్మ, మామిడి తోటలను శాస్త్రవేత్త శ్రీనివాసులురెడ్డి పరిశీలించారు. అనంతరం పండ్ల తోటల రైతులకు సూచనలు సలహాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీడ పురుగులు సోకకుండా మామిడి తోటలో కాయలు నిమ్మకాయ సైజులో ఉన్నప్పుడు ఫ్రూట్ కవర్లు తొడగాలని సూచించారు. ఈ కవర్ల లోపల నల్లటి కోటింగ్ ఉండడం ద్వారా సూర్య రశ్మి వల్ల కాయ పసుపు రంగులోకి మారు తుందని తెలిపారు. కాయలకు ఎటువంటి మచ్చలను నివారించవచ్చన్నారు. చీనీ, నిమ్మ తోటల్లో డ్రిప్ ద్వారా కేవలం 1–2 గంటల వరకు మాత్రమే నీటిని అందించాలని కోరారు. వేరు కుళ్లు సమస్య వల్ల చెట్లు ఎక్కువగా చని పోతు న్నాయని కాబట్టి ట్రైకోడెర్మా, సిడోమోనాస్ లు 5 మీ.లీటర్ల చొప్పున లీట రు నీటికి కలిపి చెట్టు చుట్టూ తడిసేలాగా 10 లీటర్ల మేర పోయాలన్నారు. కార్య క్రమంలో రైతులు, వ్యవసాయ అధికారులు, ఉద్యానవన సిబ్బంది పాల్గొన్నారు.

రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ జవహర్‌బాబు

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-కలకడ

మండలంలోని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి పి.జవహర్‌బాబు ఆధ్వర్యంలో కత్తివారిపల్లి గ్రామంలో ఫ్యామిలీ పిజిషన్ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ప్రతి నెలా ఫ్యామిలీ పిజిషన్ కార్యక్రమాన్ని గ్రామాల్లో నిర్వహించడం వల్ల మాతృ,శిశు మరణాలు పూర్తిగా తగ్గించవచ్చునని అన్నారు. అసంక్రమణ వ్యాధులు బిపి, షుగర్, కిడ్నీ వ్యాధులు డయాలసిస్ లాంటి వ్యాధులకు మంచి వైద్య సదుపాయాలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎం.పిహెచ్ఇఒ జయరామయ్య,పిహెచ్ఎన్‌కె సుబ్బరత్నమ్మ. షేక్.ముజీబ్ భాష, ఆరోగ్య కార్యకర్తలు ఆర్ శివప్రసాద్ బాబు, సి.లక్ష్మీదేవి, ఎంఎల్‌హెచ్‌పి జెఎస్.గోపికృష్ణ ఆశా కార్యకర్త కె.అమరావతి పాల్గొన్నారు.

శ్రీనివాసరెడ్డి అరెస్టు అక్రమం : 'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మాట్లాడుతున్న చమర్తి జగన్మోహన్ రాజు

టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్ శ్రీనివాసరెడ్డిని అరెస్టు చేయడం అక్రమమని, ఆయన అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని టిడిపి సీనియర్ నాయకులు చమర్తి జగన్మోహన్‌రాజు పేర్కొన్నారు. శనివారం ఆయన క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పశుసంవర్ధక శాఖ డిడి డాక్టర్ అచ్చన్న హత్యపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరుతూ అఖిలపక్షం కడప పట్టణ ర్యాలీలో పాల్గొన్న పొలిట్ బ్యూరో సభ్యులు అధ్యక్షులు ఆర్.శ్రీనివాసులు రెడ్డిని అడ్డుకొని అక్రమ అరెస్టు చేయడం పిరికిపంద చర్య అని అన్నారు. డాక్టర్ అచ్చెన్న కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ అఖిలపక్షం ఆధ్వర్యంలో ఉద్యమిస్తే అక్రమంగా అరెస్టు చేయడం దారుణమని అన్నారు. సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఈ సందర్భంగా జగన్మోహన్‌రాజు డిమాండ్ చేశారు.

ప్రపంచ తెలుగు సాహితీ ఉత్సవాలకు వీరయ్యకు ఆహ్వానం

ప్రజాశక్తి-కలికిరి

ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలకు మండలంలోని పత్తేగడ గ్రామం కొట్టాలకు చెందిన జరుగుమల్లి వీరయ్య అంతర్జాలం ద్వారా ఆహ్వాన పత్రికను అందుకున్నారు. అంతర్జాతీయ ప్రమాణాల సంస్థ గుర్తింపు పొందిన అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ, శ్రీశ్రీ కళావేదిక వారి ఆధ్వర్యంలో చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ సారథ్యంలో ఈ నెల 9, 10వ తేదీలలో తిరుపతి మహతి ఆడిటోరియంలో 48 గంటల పాటు ప్రపంచ సాహితీ బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించే కవితా గానంలో వీరయ్య పాల్గొంటారు.

మందులను పంపిణీ చేస్తున్న డాక్టర్ ఖాద్రి

ఉచితంగా యునాని మందులు పంపిణీ

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

స్థానిక వైద్య విధాన పరిషత్ ప్రభుత్వ ఆస్పత్రిలోని యునాని విభాగంలో డాక్టర్ ఖాద్రి, శివయ్యలు యునాని మందులను శనివారం ఉచితంగా పంపిణీ చేశారు. గ్యాస్టిక్ ట్రబుల్, మలబద్ధకం, అలర్జీ, మోకాలు నొప్పులు, మొలలు, జాండీస్, చర్మవ్యాధులకు ఈ మందులు ఎంతగానో పనిచేస్తాయని తెలిపారు. ఈ మందులు యునాని విభాగంలో అందుబాటులో ఉన్నాయన్నారు. కావలసినవారు తీసుకోవచ్చునని తెలిపారు.

కాంగ్రెస్‌కు పట్టిన దరిద్రం వదిలింది

ప్రజాశక్తి-పుల్లంపేట

మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి కాంగ్రెస్‌ను వీడి బిజెపిలోకి చేరడంతో కాంగ్రెస్‌కు పట్టిన దరిద్రం వదినట్లయిందని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి గోసాలదేవి, ఎస్‌సి సెల్ కన్వీనర్ నల్ల కదిరిగాళ్ల శాంతయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లి పాలు తాగి రొమ్ము మీద గుద్దే రకం మిమ్ములను ముఖ్యమంత్రి చేయడమే కాంగ్రెస్ పార్టీ చేసిన పెద్ద తప్పని అన్నారు. మీ అక్రమ సంపాదనను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎక్కడ నిలదీస్తారోనని, ఇడి, ఐటి, సిబిఐ దాడులు నిర్వహిస్తారని భయపడి పార్టీ మారడం సిగ్గుచేటన్నారు. పీలేరు నియోజకవర్గంలో మీ వంశానికి రాజకీయ భిక్ష పెట్టింది కాంగ్రెస్ పార్టీ అన్ని తిన్న ఇంటికే వాసాలను లెక్క పెట్టడం కిరణ్ కుమార్ రెడ్డి తత్వమని అన్నారు. దేశంలో కోట్లాది మంది కార్యకర్తలు ఉన్నారని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడ నిన్ను తిరగకుండా అడ్డుకుంటామని కాంగ్రెస్ పార్టీ తరపున హెచ్చరిస్తున్నామన్నారు. 2024 సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావడం తథ్యం అని తెలిపారు. సమావేశంలో పుల్లంపేట మండల అధ్యక్షుడు సిగమాల రమేష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి గోసాల దేవి

క్రైం కార్నర్

దాడి ఘటనలో ఐదుగురిపై కేసు నమోదు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

ఓ కుటుంబం పై దాడికి పాల్పడిన ఘటనలో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ రమేష్ బాబు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గతనెల నెల 26న వెంగంవారిపల్లి పంచాయతీ బాలినాయన పల్లిలో నిర్వహించిన చౌడేశ్వరి దేవి జాతరకు మదనపల్లి కు చెందిన అమరావతి భర్త వెంకటరమణ తో కలిసి బంధువుల ఇంటికి వచ్చి మదనపల్లికి తిరుగు ప్రయాణమయ్యారు. కొమ్మిరెడ్డిగారి పల్లి సమీపంలో మదనపల్లికి చెందిన చంగల్రాయుడు, భార్య రమాదేవి, కుమారులు బాలాజీ, నవీన్, కుమార్తె జయంతిలు కలసి అమరావతి కుటుంబంపై బూతులు తిడుతూ, రాళ్ళు, చెప్పులతో కొడుతూ దాడి చేశారని అన్నారు. ఈ దాడిలో గాయపడిన అమరావతి తిరుపతి స్విమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొంది డిశ్చార్జి అయ్యి ఇంటికి రావడం జరిగిందన్నారు. శనివారం బాధితురాలు అమరావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ రమేష్ బాబు తెలిపారు.